సాక్షి ఒడిశా

శనివారం । 15 । జూలై । 2023



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయం హుండీలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన ఆదాయాన్ని పాలక వర్గం శుక్రవారం లెక్కించారు. ఇందులో నగదు రూ.4,79,499లు, బంగారం 20 మిల్లీగ్రాములు, వెండి 10.7 గ్రాములు వచ్చాయని అధికారులు తెలిపారు.



పెళ్లి పేరుతో మోసం

● యువతి నుంచి రూ.8 లక్షలతో ఉడాయించిన యువకుడు

- 8లో.



ఝురపడా జైలుకు నిందితుల తరలింపు

- 8లో.

న్యూస్‌రీల్

చంద్రగిరి సీహెచ్‌సీలో కలెక్టర్ తనిఖీలు



సూపరింటెండెంట్‌తో మాట్లాడుతున్న కలెక్టర్ స్మృతిరంజన్

పర్లాకిమిడి: గజపతి జిల్లా మోహానా సమితి చంద్రగిరి సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని కలెక్టర్ స్మృతిరంజన్ ప్రధాన్ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. సిబ్బంది హాజరు, మందులు, సామగ్రి నిల్వలపై సూపరింటెండెంట్‌ను అడిగి తెలుసుకున్నారు. రికార్డులు గందరగోళంగా ఉండటంపై ఒకింత అసహనానికి గురైన ఆయన.. మరోసారి వచ్చినప్పుడు నిర్మయా మెడిసిన్ కేంద్రంలో ఉచిత మందులు స్టాకు ఉడాలని స్పష్టంచేశారు.

గుణుపూర్ ఎస్‌డీపీఓగా బబులి



బబులి నాయక్

రాయగడ: జిల్లాలోని గుణుపూర్ సబ్ డివిజన్ పోలీస్ అధికారిగా బబులి నాయక్ నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర డీజీపీ కార్యాలయం నుంచి శుక్రవారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. ప్రస్తుతం గజపతి జిల్లా పర్లాకిమిడి పోలీస్ స్టేషన్‌లో ఐఐసీగా విధులు నిర్వహిస్తున్న బబులి.. పదోన్నతిపై ఇక్కడకు రానున్నారు. సోమవారం ఆయన బాధ్యతలు స్వీకరించనున్నట్లు సమాచారం.

45కిలోల గంజాయి పట్టివేత



గంజాయితో పట్టుబడిన నిందితులు

మల్కన్‌గిరి: జిల్లాలోని చిత్రకొండ సమితిలో గురువారం రాత్రి పోట్రోలింగ్ నిర్వహిస్తున్న పోలీసులు బస్టాండ్ వద్ద అనుమానాస్పదంగా తిరుగాడుతున్న ముగ్గురు వ్యక్తులను తనిఖీ చేశారు. వారి వద్ద ఉన్న 2బస్తాల్లో 45కిలోల గంజాయిని గుర్తించి, అరెస్ట్ చేశారు. నిందితులపై కేసు నమోదు చేసి, శుక్రవారం ఉదయం కోర్టులో హాజరు పరిచారు. వీరంతా హర్యాణా లోని కురుక్షేత్ర జిల్లా గోడచోక్ గ్రామానికి చెందిన ప్రకాష్(63), ధానేశ్వర్‌కు చెందిన శ్రీనివాస్(55), రాయగడ జిల్లా అమితి గ్రామానికి చెందిన కందిరి సంత్రరావు(49)గా గుర్తించారు. నిందితుల నుంచి సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన సరుకు విలువ రూ.లక్షకు పైగా ఉంటుందని చిత్రకొండ పోలీసులు తెలిపారు.


నకిలీ గుట్కా కేంద్రంపై దాడి



నకిలీ గుట్కా కర్మాగారంలో ఎస్పీ సరవణ్ వివేక్, సిబ్బంది

బరంపురం: నగర శివారులోని లుచ్చాపడా–నిమ్మఖండి మార్గంలో నకిలీ గుట్కా కర్మాగారంపై పోలీసులు శుక్రవారం దాడి చేశారు. ఇందులో భారీగా నకిలీ గుట్కాతో పాటు తయారీ సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. దీనిపై పోలీసులు తెలిపిన సమాచారం ప్రకారం నిమ్మఖండి పోలీసు ఔట్‌పోస్ట్ పరిధి నిమ్మఖండి గ్రామానికి సమీపంలో గత కొద్ది రోజులుగా నకిలీ గుట్కా కర్మాగారం నిర్వహిస్తున్నారు. దీనిపై సమాచారం అందుకున్న పోలీసులు.. ఎస్పీ సరవణ్ వివేక్ ఆధ్వర్యంలో ప్రత్యేక బృందంగా ఏర్పడి, తయారీ కేంద్రంపై దాడి చేశారు. గుట్కా సామగ్రి, లేబుళ్లు, యంత్రాలను స్వాధీనం చేసుకొని, ఒకరి అరెస్ట్ చేశారు.

అటవీ కలప స్వాధీనం



స్వాధీనం చేసుకున్న కలపతో అటవీశాఖ అధికారులు

మల్కన్‌గిరి: జిల్లాలోని బలిమెల అటవీశాఖ అధికారులు ముందస్తు సమాచారంతో సోమానాథ్‌పూర్ పంచాయతీ పరిధి హతింబ అటవీ ప్రాంతం నుంచి అక్రమంగా తరలిస్తున్న కలపను స్వాధీనం చేసుకున్నారు. సిబ్బంది రాకను గమనించిన నిందితులు, ట్రాక్టర్‌ను వదిలి పరారయ్యారు. ఈ మేరకు వాహనంతో పాటు కలపను శుక్రవారం ఉదయం బలిమెలకు తరలించారు. అటవీశాఖ రేంజర్ జగన్నాథ్ బిసోయి మాట్లాడుతూ నిందితుల కోసం గాలిస్తున్నామని, ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని వివరించారు.

పశ్చిమ ఒడిశా అభివృద్ధికి చర్యలు



ప్రాజెక్టులను వర్చువల్‌గా ప్రారంభిస్తున్న సీఎం నవీన్ పట్నాయక్


- 'ముఖ్యమంత్రి సభ ఘురొ' పథకాన్ని ప్రారంభించిన సీఎం
- 2వేల కల్యాణ మండపాలు, ఆడిటోరియంల నిర్మాణాలకు యోచన

భువనేశ్వర్: పశ్చిమ ఒడిశాలో ముఖ్యమంత్రి సభ ఘురొ(ముఖ్యమంత్రి సమావేశ మందిరం) పథకాన్ని సీఎం నవీన్ పట్నాయక్ శుక్రవారం ప్రారంభించారు. ఈ పథకం కింద పశ్చిమ ఒడిశాలో రూ.25 కోట్ల వ్యయంతో 2వేల కల్యాణ మండపాలు, ఆడిటోరియంలు నిర్మించనున్నారు. ప్రజల సామాజిక-సాంస్కృతిక కార్యకలాపాలను ప్రోత్సహించే లక్ష్యంతో రాష్ట్రప్రభుత్వం 5టీ కార్యక్రమం కింద ఈ పథకం చేపడుతోంది. ఈ సందర్భంగా వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ముఖ్యమంత్రి మాట్లాడుతూ అభివృద్ధి పట్ల రాష్ట్రప్రభుత్వం నిరంతరం దృష్టి సారిస్తోందన్నారు. ఈ నేపథ్యంలో పశ్చిమ ఒడిశా అభివృద్ధి మండలి(డబ్ల్యూఓడీసీ) బడ్జెట్ కేటాయింపులు రెట్టింపు చేసినట్లు పేర్కొన్నారు. ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలపై ఈ ప్రాంత ప్రజాప్రతినిధులతో తరచూ సంప్రదిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్ర సమగ్ర అభివృద్ధిలో ఈ ప్రాంతం కీలకపాత్ర పోషిస్తుందన్నారు. ప్రజల ఆర్థిక అభ్యున్నతి కోసం వ్యవసాయం, పరిశ్రమలు, గనులు, విద్య, కళలు సాంస్కృతిక రంగాల్లో అనేక పథకాలు, ప్రాజెక్టులను అమలు చేస్తున్నట్లు వివరించారు.

రూ.33.58 కోట్లతో..

మా సమలేశ్వరి, హరిశంకర్, నృసింహనాథ్ ఆలయాల రూపాంతరం పనులు చురుగ్గా కొనసాగుతున్నాయని సీఎం నవీన్ తెలిపారు. ఇతర ఆలయాల మౌలిక సదుపాయాల అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. అన్ని ప్రాజెక్టుల కార్యకలాపాలను ముఖ్యమంత్రి కార్యాలయం ప్రత్యక్షంగా పర్యవేక్షిస్తుందని భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా రూ.33.58 కోట్ల వ్యయ ప్రణాళికతో కూడిన పలు ప్రాజెక్టులకు ముఖ్యమంత్రి శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు చేశారు. ఈ ప్రాజెక్టుల్లో బొలంగీర్‌లో గడియాజొరా వంతెన, టిట్లాగఢ్‌లో టౌన్ హాల్, బర్‌గడ్‌లో ఎకో మ్యూజియం, దేవ్‌గడ్‌లో ఆడిటోరియం, కలహండిలో బ్రజ్‌మోహన్ ఉన్నత పాఠశాల విద్యార్థుల హాస్టల్, సంబల్‌పూర్‌లో జీఎం కళాశాల ఆడిటోరియం ఉన్నాయి. వీడియో కాన్ఫరెన్స్‌లో టిట్లాగఢ్ నుంచి మంత్రి టుకుని సాహు, బర్‌గడ్ నుంచి రీతా సాహు, దేవ్‌గఢ్ నుంచి రాజేంద్రప్రసాద్ ఢొలకియా, పశ్చిమ ఒడిశా అభివృద్ధి మండలి చైర్మన్ అసిత్ త్రిపాఠి పాల్గొన్నారు.

● విజయీభవ..



పూరీ సాగర తీరంలో చంద్రయాన్-3 సైకతశిల్పం

భువనేశ్వర్: ప్రఖ్యాత సైకత కళాకారుడు సుదర్శన్ పట్నాయక్ పూరీ గోల్డెన్ బీచ్‌లో 'విజయీభవ' సందేశంతో 500 స్టీల్ గిన్నెలతో చంద్రయాన్-3 సైకత కళాఖండాన్ని గురువారం ఆవిష్కరించారు. 22 అడుగుల పొడవైన ఈ సైకత శిల్పాన్ని తీర్చిదిద్దడంలో 15 టన్నుల ఇసుక వినియోగించాడు. సుదర్శన్‌కు చెందిన సైకత కళ పాఠశాల విద్యార్థులతో కలిసి ఈ అద్భుతమైన కళాఖండాన్ని సిద్ధం చేశారు.

గవర్నర్, సీఎం అభినందనలు

భువనేశ్వర్: శ్రీహరికోటలోని సతీష్ ధావన్ అంతరిక్ష కేంద్రం నుంచి చంద్రయాన్-3 మిషన్ విజయవంతమై, సరికొత్త చారిత్రాత్మక శకం ఆవిష్కరించిందని ఇస్రో శాస్త్రవేత్తల బృందానికి గవర్నర్ ప్రొఫెసర్ గణేషీలాల్ అభినందించారు. ఈ విజయం భారత అంతరిక్ష చరిత్రలో కొత్త అధ్యాయాన్ని సృష్టిస్తుందన్నారు. చంద్ర మండలంలో అడుగిడే మూడో వైజ్ఞానిక కృషికి తార్కాణం చంద్రయాన్-3 మిషన్ విజయవంతం కావడమని సీఎం నవీన్ పట్నాయక్ ఇస్రోకు హృదయపూర్వక అభినందనలు తెలియజేశారు. చంద్ర మండలానికి చారిత్రాత్మక ప్రయాణం దేశం, అంతరిక్ష అన్వేషణ, శాస్త్రీయ పురోగతికి మరో ముఖ్యమైన ముందడుగు అవుతుందని ఆయన ఆకాంక్షించారు.

సెంచూరియన్‌తో జేఎన్‌యూ ఒప్పందం

- వనరుల కల్పన, నైపుణ్యాభివృద్ధి, వ్యవస్థాపక విద్యపై ఎంఓయూ



జేఎన్‌యూ వీసీకి జ్ఞాపిక అందిస్తున్న సెంచూరియన్ వీసీ సుప్రియా పట్నాయక్



ఒప్పంద పత్రాలతో రెండు విశ్వవిద్యాలయాల ఉన్నతాధికారులు

పర్లాకిమిడి: ఉన్నత విద్యలో ప్రపంచ దేశాలతో పోటీ పడుతూ, దేశంలో నైపుణ్య విద్య, కొత్త కల్పన, వ్యవస్థాపకతలో ఎంతో ఉన్నతి సాధించామని సెంచూరియన్ వర్సిటీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ సుప్రియా పట్నాయక్ తెలిపారు. కేంద్ర నైపుణ్యాభివృద్ధి, ఉద్యోగ కల్పనలో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌గా పేరొందడం ఆనందంగా ఉందన్నారు. సెంచూరియన్ వర్సిటీ(పర్లాకిమిడి), జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీ(ఢిల్లీ) ఎంఓయూ కుదుర్చుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ ఒప్పందంతో ఉన్నత సాంకేతిక విద్యలో జేఎన్‌యూ-సెంచూరియన్ సంయుక్తంగా తమ అనుభవాలు, పరిశోధలను పంచుకోనున్నాయన్నారు. దీనివల్ల భవిష్యత్‌లో ఉన్నత విద్యలో మరింత అభివృద్ధి సాధ్య పడుతుందని ఆశాభావం వ్యక్తంచేశారు. రెండు విశ్వవిద్యాలయాలు కలయికతో సాంకేతిక విద్యలో రూపకల్పన, విద్య, నైపుణ్యాభివృద్ధి సాధ్యమవుతుందని జేఎన్‌యూ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ శాంతిశ్రీ ధూలిపూడి అన్నారు. సెంచూరియన్ వర్సిటీ బోర్డు మీటింగ్ హాలులో జరిగిన ఈ కార్యక్రమంలో జేఎన్‌యూ డాక్టర్ ఉక్తపాల్‌కుమార్ దేవనాథ్, మనోజ్‌కుమార్ మంజు, అభినవ్ మదన్(సీయూటీఎం), అంబుడ్స్‌మన్(సీయూటీఎం) మోనాలిసా ఘోష్ తదితరులు పాల్గొన్నారు.

ఉసరవెల్లిని రక్షించిన జంతు ప్రేమికుడు



ఉసరవెల్లితో జంతు ప్రేమికుడు కృష్ణకేశవ్ షడంగి

కొరాపుట్: అరుదైన జంతు జాలాన్ని పరిరక్షించే జంతు ప్రేమికుడు కృష్ణకేశవ్ షడంగి ఉసరవెల్లిని రక్షించారు. జయపురానికి చెందిన కేశవ్ వ్యక్తిగత పనిపై శుక్రవారం కొరాపుట్‌కు వెళ్తున్నారు. పట్టణ సమీపంలోని ఘాట్ రోడ్డుపై కనిపించిన ఉసరవెల్లి.. వాహనాల రాకపోకలతో భయపడి కదలకుండా ఉండిపోయింది. గమనించిన ఆయన సురక్షితంగా పట్టుకొని, సమీపంలోని అటవీ ప్రాంతంలో వదలిపెట్టారు. ఉసరవెల్లి పరిసరాలకు అనుగుణంగా తన శరీర రంగులు మారుస్తుందని, తెలుపు రంగులోకి మాత్రం మారదని కేశవ్ పేర్కొన్నారు.

వ్యాధులపై అప్రమత్తం



ఖజురిగుడలో దోమతెరలు పంపిణీ చేస్తున్న చైర్‌పర్సన్ అనసూయ

రాయగడ: వర్షాకాలంలో విస్తారంగా వ్యాపించే డెంగీ, మలేరియా వ్యాధులపై అంతా అప్రమత్తంగా ఉండాలని స్పెషల్ డెవలప్‌మెంట్ కౌన్సిల్(ఎస్‌డీసీ) చైర్‌పర్సన్ అనసూయ మాఝి అన్నారు. ప్రతిఒక్కరూ తగు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. జిల్లాలోని కాసీపూర్ సమితి కుచేయిపాదోరా పంచాయతీ ఖజురిగుడ, పుకేష్ గ్రామాల్లో శుక్రవారం పర్యటించిన ఆమె.. గ్రామస్తులకు దోమతెరలు పంపిణీ చేశారు. నిర్లక్ష్యం లేకుండా నిద్రించే సమయంలో దోమతెరలు వినియోగించాలని సూచించారు. ఏటా కాసీపూర్ ప్రాంత వాసులు వివిధ రోగాల బారిన గురవుతుంటారని ఆవేదన వ్యక్తంచేశారు. వారిలో చైతన్యం లేకపోవడంతో పాటు వ్యాధులపై సరైన అవగాహన లేకపోవడమే దీనికి ప్రధాన కారణమన్నారు. సమితిలోని మరికొన్ని గ్రామాల్లో దోమతెరలు పంపిణీ చేసేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు ఆమె వివరించారు.

రాగుల వినియోగం శ్రేయస్కరం



ప్రసంగిస్తున్న కలెక్టర్ స్వాధాదేవ్ సింగ్

- కలెక్టర్ స్వాధాదేవ్ సింగ్



రాగులతో తయారైన వంటకాలు

రాయగడ: అధిక పోషకాలు కలిగిన రాగుల వినియోగం ఎంతో శ్రేయస్కరమని జిల్లా కలెక్టర్ స్వాధాదేవ్ సింగ్ అన్నారు. అంతర్జాతీయ మిల్లెట్స్ సంవత్సరాన్ని పురస్కరించుకుని స్థానిక డీఆర్‌డీఏ సమావేశం మందిరంలో సమన్వయ సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆమె మాట్లాడుతూ ఐక్యరాజ్య సమితి ఈ ఏడాదిని అంతర్జాతీయ తృణధాన్యాల సంవత్సరంగా ప్రకటించడంతో రాగుల సాగు, వాటితో తయారయ్యే పదార్థాలకు ఎంతో ఆవశ్యకత ఏర్పడిందన్నారు. గతంలో రాగుల వినియోగం ఆదివాసీ ప్రాంతాల్లో అధికంగా ఉండేదని, వారి ఆహారంలో ప్రధాన భాగం వీటిదేనని తెలిపారు. కాలక్రమేనా చోడి వినియోగం వల్ల కలిగే ప్రయోజనాలు, వాటిలోని పోషక విలువలు గుర్తించడంతో ప్రస్తుతం వాటి వినియోగం ఎంతో పెరిగిందన్నారు. అంతర్జాతీయ స్థాయిలో కూడా రాగులు ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్నాయని వివరించారు. దీనిని గుర్తించి, చోడి సాగుపై రైతులకు అవగాహన కల్పించేందుకు జిల్లా యంత్రాంగం తగు చర్యలు తీసుకుంటోందన్నారు. ఈ సందర్భంగా స్వయం సహాయక బృందాలకు చెందిన మహిళలు రాగులతో తయారైన వంటకాలు, కేకులను ప్రదర్శనలో ఉంచారు. సమావేశంలో డీఆర్‌డీఏ ప్రాజెక్టు అధికారి రవినారాయణ త్రిపాఠి, జిల్లా వ్యవసాయశాఖ అధికారి మనోజ్‌కుమార్ ప్రధాన్ తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణల తొలగింపునకు చర్యలు

పర్లాకిమిడి: పట్టణంలోని మార్కెట్ జంక్షన్ సమీపంలో నెలకొన్న అక్రమ నిర్మాణాలతో మురుగు కాలువలు మూసుకుపోయాయి. ఈ నేపథ్యంలో వాటి తొలగింపునకు మున్సిపల్ అధికారులు చర్యలు చేపట్టారు. శుక్రవారం యంత్రాల సాయంతో ఆక్రమణలు తొలగించారు. ప్రధానంగా బజారు జంక్షన్ వద్ద ఆక్రమణల వల్ల మురుగు కాలువలు ప్లాస్టిక్ సంచులతో నిండిపోయి దుర్వాసన వెదజల్లడంతో పాటు రోజూ ట్రాఫిక్ సమస్య ఏర్పడుతోందని మున్సిపల్ ఈఓ వనమాలి శత్పతి తెలిపారు. ఈ నేపథ్యంలో డ్రెయిన్లపై ఏర్పాటు చేసుకున్న దుకాణాలు ఖాళీ చేయాలని గత నెల రోజులుగా వార్డుల్లో ప్రచారం చేశామన్నారు. దీనిపై వ్యాపారులు స్పందించక పోవడంతో చర్యలకు దిగినట్లు వివరించారు.

యువకుల హత్య కేసులో నిందితుల అరెస్ట్



పోలీసుల అదుపులో నిందితులు

బరంపురం: నగర శివారు మౌడా గ్రామంలో జూన్ 29న చోటు చేసుకున్న జంట హత్యలకు సంబంధించి ముగ్గురు నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. దీనిపై బరంపురం ఎస్పీ సరవణ్ వివేక్ అందించిన సమాచారం ప్రకారం జిల్లాలోని దిగపండి పోలీసు స్టేషన్ పరిధి మౌడాలో శివరామ్ గౌడా, లిట్టురాజ్, పలువురు గ్రామస్తుల మధ్య వివాదం తలెత్తింది. దీంతో ఆగ్రహానికి గురైన గ్రామస్తులు.. ఇరువురు యువకులపై దాడి చేసి, తీవ్రంగా గాయపరిచారు. అనంతరం వారి బైక్ నుంచి పెట్రోల్‌ను ఒంటిపై చల్లి, నిప్పంటించారు. ఘటనలో ఇరువురూ అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. దీనిపై కేసు నమో దు చేసి, దర్యాప్తు చేపట్టిన పోలీసులు ముగ్గురు నిందితులను అదులోకి తీసుకున్నారు. వారు అదే గ్రామానికి చెందిన అపుర్బ బాసిత్ర, పవిత్ర నాయక్, సంజాయ్ సాహుగా గుర్తించారు. నిందితుల అనుంచి ఇనుప రాడ్, దాడికి ఉపయోగించిన వస్తువులు, 3 సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు.

ప్రశాంతంగా ముగిసిన జిల్లా బంద్

- డిమాండ్ల పరిష్కారం కోరుతూ పిలుపునిచ్చిన కాంగ్రెస్ పార్టీ



రోడ్డుపై నిరసన వ్యక్తం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు



మల్కన్‌గిరి బస్టాండ్‌లో నిలిచిన ఆర్టీసీ సర్వీసులు

మల్కన్‌గిరి: వివిధ డిమాండ్ల పరిష్కారం కోరుతూ కాంగ్రెస్ పార్టీ శుక్రవారం పిలుపునిచ్చిన బంద్ ప్రశాంతంగా ముగిసింది. దీని ప్రభావంతో జిల్లా కేంద్రం నుంచి వివిధ ప్రాంతాలకు రాకపోకలు నిలిచిపోయాయి. ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం వరకు బస్సు సర్వీసులన్నీ రద్దయ్యాయి. దీంతో ప్రయాణికులు బస్టాండ్ వద్దే పడిగాపులు కాసారు. అలాగే పాఠశాలలు, కళాశాలలు తెరుచుకోక పోవడంతో మెయిన్ రోడ్లన్నీ బోసిపోయి, కర్ఫ్యూని తలపించాయి. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మెయిన్ రోడ్డుపై నిరసన వ్యక్తం చేసిన అనంతరం మాట్లాడారు. మల్కన్‌గిరిలో 2018లో ప్రారంభమైన 7 అంతస్తుల జిల్లా కేంద్రాస్పత్రిలో ఇప్పటికి 130మంది వైద్యులు పోస్టులు ఖాళీగా ఉన్నాయని తెలిపారు. అలాగే ఆస్పత్రికి 3కిలోమీటర్ల దూరంలో బ్లడ్‌బ్యాంక్ ఉండటంతో రోగులకు సకాలంలో రక్తం అందక ఇబ్బందులు పడుతున్నారన్నారు. జిల్లా కేంద్రంలో బీఈడీ కళాశాల నిర్మించి, ఐదేళ్లు కావస్తున్నా ఇప్పటి వరకు ప్రారంభానికి నోచుకోలేదని ఆవేదన వ్యక్తంచేశారు. జిల్లాలో ఖాళీగా ఉన్న వివిధ పోస్టుల భర్తీకి ప్రభుత్వం చర్యలు చేపట్టక పోవడంతో నిరుద్యోగ సమస్య పెరిగిపోయిందని వివరించారు. సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలని జూన్ 23న కలెక్టర్ విశాల్‌సింగ్‌కు వినతిపత్రం అందించినా స్పందించక పోవడంతో బంద్‌కు పిలుపునిచ్చామని స్పష్టంచేశారు. నిరసనలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు గోవింద పాత్రొ, జి.శ్రీనివాసరావు, పి.కేశవరావు, పరుశురామ్ భుక్తా, మాల మాఢి, కార్యకర్తలు పాల్గొన్నారు.

క్లుప్తంగా

గిరిజన విద్యార్థులకు ఆర్థికసాయం



వేదికపై ఎస్‌డీసీ చైర్మన్ చంద్రశేఖర్ మాఝి, ఎమ్మెల్యేలు, ఏడీఎంలు

కొరాపుట్: ఇతర రాష్ట్రాల్లో విద్య అభ్యసిస్తున్న రాష్ట్రానికి చెందిన గిరిజన విద్యార్థులకు ఆర్థికసాయం చేస్తామని కొరాపుట్ ఎస్‌డీసీ చైర్మన్ చంద్రశేఖర్ మాఝి ప్రకటించారు. కొరాపుట్ జిల్లా కేంద్రంలో శుక్రవారం జరిగిన ప్రత్యే కార్యక్రమంలో ప్రసంగించారు. ఉన్నత విద్య అభ్యసించేందుకు ఆసక్తి ఉన్న వారికి ఇదో అవకాశం కాగలదన్నారు. కొరాపుట్ జిల్లా నందపూర్ సమితి కురజి పంచాయతీ సెమ్లా గ్రామానికి చెందిన పాత్ర కిరసానీ కర్ణాటక లోని సుర్తకల్‌లో ఎంసీఏ చదువుతుండగా, ప్రోత్సాహకం కింద రూ.లక్ష 5 వేలను అందజేశారు. భవిష్యత్‌లో ఉన్నత స్థానంలో నిలవాలని ఆకాంక్షించారు. సమావేశంలో పొట్టంగి ఎమ్మెల్యే పీతం పాఢి, కొరాపుట్ ఎమ్మెల్యే రఘురాం పాడల్, లక్ష్మీపూర్ ఎమ్మెల్యే ప్రభుజానీ, ఏడీఎంలు రామేశ్వర్ ప్రధాన్, రాజేంద్ర మాఝి తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

పార్వతీపురం: అగ్నిపథ్ పథకంలో అగ్నివీర్, వాయుసేనలో ఉద్యోగ నియామకానికి ఆన్‌లైన్ ద్వారా అవివాహిత పురుషులు, మహిళా అభ్యర్థుల నుండి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని యువజన సర్వీసుల శాఖ, సెట్విజ్, జిల్లా స్పోర్ట్స్ ఆథారిటీ అధికారి బి.రామ్‌గోపాల్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అగ్నివీర్(ఆర్మీ), అగ్నివీర్ వాయు(ఎయిర్‌ఫోర్స్)లో ఉద్యోగాలకు ఇంటర్మీడియెట్, డిప్లొమా పూర్తి చేసిన అభ్యర్థులు ఆన్‌లైన్ ద్వారా ఈ నెల 27 నుండి ఆగస్టు 17వరకు హెచ్‌టీటీపీఎస్://అగ్నిపథ్‌వాయు.సిడిఏసి.ఇన్ వెబ్‌సైట్‌లో దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు.

టీటీడీ ఆధ్వర్యంలో నీతికథల పోటీలు

విజయనగరం టౌన్: తిరుమల తిరుపతి దేవస్థానం, హిందూ ధర్మ ప్రచార పరిషత్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఉభయ జిల్లాల్లో జిల్లా శాఖ ఆధ్వర్యంలో నీతికథల పోటీలను ఈ నెల 16, 17 తేదీల్లో నిర్వహిస్తున్నట్లు టీటీడీ ప్రోగ్రాం అసిస్టెంట్ జె.శ్యామ్ సుందర్ పేర్కొన్నారు. ఈ మేరకు శుక్రవారం వాల్‌పోస్టర్లను టీటీడీ ఆవరణలో ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 'కథ చెబుతావా... ఊ కొడతాం' పేరుతో స్థానిక టీటీడీ కల్యాణ మండపంలో ఈ నెల 16న , పార్వతీపురం మన్యం జిల్లాలో కొమరాడ మండలం కోటిపాం జెడ్పీ ఉన్నత పాఠశాలలో 17న పోటీలు నిర్వహిస్తామని తెలిపారు. జూనియర్, సీనియర్ విభాగాల్లో పోటీలు ఉంటాయన్నారు. ఆసక్తి గల విద్యార్థులు 94414 61076 నంబరును సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు పీవీ నరసింహాచార్యులు, జి.తిరుపతిరావు, కావ్యశ్రీ తదితరులు పాల్గొన్నారు.

రైలు కింద పడి వ్యక్తి మృతి

చీపురుపల్లి: పట్టణంలోని రైల్వేస్టేషన్‌లో రైలు కింద పడి గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్టు జీఆర్‌పీ ఎస్‌ఐ చెల్లూరి శ్రీనివాసరావు తెలిపారు. స్థానిక రైల్వేస్టేషన్‌లో రెండవ నంబరు ప్లాట్‌ఫాంలో శుక్రవారం మధ్యాహ్నం వాస్కో డిగామ రైలు కింద గుర్తు తెలియని వ్యక్తి పడి మృతి చెందినట్లు ఆయన తెలిపారు. మృతుడి 30 సంవత్సరాల వయస్సు కలిగి, గ్రీన్ రంగు షర్ట్, నీలి రంగు జీన్ ప్యాంట్ ధరించి ఉన్నట్లు పేర్కొన్నారు. మృతుడి వివరాలు తెలిసిన వారు 70132 73731 నంబరును సంప్రదించాలని కోరారు.

రైలు ఢీకొని...

బొబ్బిలి: పట్టణంలోని ఫ్లెటీవర్ కింద నుంచి ఇందిరమ్మ కాలనీలోని తన ఇంటికి వెళ్లేందుకు ట్రాక్ దాటుతున్న పి.ప్రసాద్ అనే వ్యక్తిని రాయగడ - విజయవాడ పాసింజర్ రైలు ఢీకొనడంతో తీవ్ర గాయాల పాలయ్యాడు. వెంటనే స్థానికులు, రైల్వే సిబ్బంది గుర్తించి క్షతగాత్రుడ్ని అదే ట్రైన్‌లోని గార్డు బోగిలో ఎక్కించి స్టేషన్‌కు తీసుకువచ్చారు. అక్కడి నుంచి 108 వాహనం ద్వారా బొబ్బిలి సీహెచ్‌సీకి తరలించి ప్రథమ చికిత్స అందించారు. మెరుగైన చికిత్స కోసం విజయనగరం తరలిస్తుండగా గజపతినగరం వద్ద మృతి చెందాడు. మృతుడి అన్న కుమారుడు సాయి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

వివాహిత ఆత్మహత్య

విజయనగరం క్రైమ్: ఉరేసుకుని వివాహిత మృతి చెందిన సంఘటన పట్టణంలో చోటు చేసుకుంది. దీనికి సంబంధించి రూరల్ పోలీసులు శుక్రవారం అందించిన వివరాలిలా ఉన్నాయి. స్థానిక వీటీ అగ్రహారం బీసీ కాలనీలో నివాసం ఉంటున్న హేమలత (19) భీమునిపట్నం మద్దిలపేట గ్రామానికి చెందిన శంకరరావుతో గతేడాది నవంబరులో హైదరాబాద్‌లో ప్రేమ వివాహం చేసుకుంది. వీటీ అగ్రహారం బీసీ కాలనీలో ఇల్లు అద్దెకు తీసుకుని ఫాస్ట్‌ఫుడ్ సెంటర్ నడుపుతూ జీవనం సాగిస్తున్నారు. ఇదిలా ఉంటే శంకరరావు మాజీ ప్రియురాలు షాపు వద్దకు మూడు రోజులుగా వస్తూ, హేళన చేస్తుండడంతో హేమలత మనస్తాపం చెంది గురువారం రాత్రి ఇంట్లో ఎవరూ లేని సమయంలో సీలింగ్ ఫ్యాన్‌కి ఉరేసుకుంది. ఇది గమనించిన స్థానికులు కొన ఊపిరితో ఉన్న ఆమెను కేంద్రాస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఆమె శుక్రవారం మృతి చెందింది. రూరల్ సీఐ టివి.తిరుపతిరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మునిగుడ ఆస్పత్రిలో మెరుగైన సౌకర్యాలు

- వైద్య సమీక్షలో మంత్రి జగన్నాథ సరక



సమీక్ష మాట్లాడుతున్న మంత్రి జగన్నాథ సరక

రాయగడ: జిల్లాలోని మునిగుడ ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు కృషి చేస్తామని రాష్ట్ర ఆదివాసీ, హరిజన సంక్షేమ, న్యాయశాఖ మంత్రి జగన్నాథ సరక భరోసా ఇచ్చారు. స్థానిక పంచాయతీ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన రోగి కల్యాణ సమితి సమీక్ష సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత రెండేళ్లలో మునిగుడ ఆస్పత్రిలో రోగుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతోందన్నారు. దీనికి అనుగుణంగా సౌకర్యాలు కల్పించాల్సిన అవశ్యకత ఉందని తెలిపారు. భవిష్యత్‌లో రోగి కల్యాణ యోజన పథకం కింద అవసరమైన సౌకర్యాలను కల్పించే దిశగా చర్యలు చేపడతామని వెల్లడించారు. కార్యక్రమంలో భాగంగా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సవ్యసాచి మహాపాత్రొ వార్షిక నివేదికను వివరించారు. 2022లో మునిగుడ ఆరోగ్య కేంద్రానికి చికిత్స నిమిత్తం 69,536మంది వచ్చారని, ఈ ఏడాది ఇప్పటి వరకు 20,536మంది వైద్య సేవలు పొందారన్నారు. అదేవిధంగా ఈ ఏడాది 167 ప్రసవాలు నమోదయ్యాయని పేర్కొన్నారు. వివిధ సమస్యలను మంత్రి దృష్టికి తీసుకువెళ్లారు. ఎక్స్‌రే మిషన్, బ్లడ్ బ్యాంక్ ఏర్పాటు, ఖాళీగా ఉన్న వైద్యుల పోస్టుల భర్తీ తదితర అంశాలను తెలియజేశారు. సమావేశంలో మునిగుడ సమితి అధ్యక్షురాలు దుఖినీ సుంద్రుక, బీడీఓ ప్రీతమ్‌కుమార్ తంత్రి తదితరులు పాల్గొన్నారు.

పెళ్లి పేరుతో మోసం

- యువతి నుంచి రూ.8 లక్షలతో ఉడాయించిన యువకుడు



మల్కన్‌గిరి పోలీసుల అదుపులో నిందితుడు లక్ష్మీకాంత్‌నాథ్

మల్కన్‌గిరి: జిల్లా కేంద్రంలోని ఆరో కాలానీకి చెందిన ఓ యువతిని పెళ్లి పేరుతో మోసం చేసిన యువకుడు, రూ.8 లక్షలు తీసుకొని పరారయ్యాడు. దీనిపై మల్కన్‌గిరి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు నమోదైంది. దీనికి సంబంధించి పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి. మల్కన్‌గిరికి చెందిన యువతి తన వివరాలను వివాహ సంబంధిత వెబ్‌సైట్ మ్యాట్రీమొనీలో నమోదు చేసుకుంది. దీనిపై స్పందించిన అనుగూల్‌కు చెందిన లక్ష్మీకాంత్ నాథ్ ఫొటో పంపాలని కోరగా, ఆమె పంపించింది. ఇరువురూ ఇష్టపడటంతో ఫోన్ నంబర్లు మార్చుకొని, రోజూ మాట్లాడుకొనేవారు. ఇదిలా ఉండగా.. తన తల్లితో కలిసి భువనేశ్వర్‌లో హోటల్ నడుపుతున్నానని, నిర్వాహణలో నష్ట వచ్చిందని, రూ.70 వేలు కావాలని అడిగాడు. నమ్మిన యువతి.. అడిగినంత సొమ్ము పంపించింది. మరికొంత కాలానికి రూ.6 లక్షల 50వేలు కావాలని మళ్లీ అడగడంతో అప్పు చేసి మరీ ఇచ్చింది. తరువాతి నుంచి యువతి ఫోన్‌కు స్పందించక పోవడంతో పాటు డబ్బులు తిరిగి ఇవ్వాలని అడిగితే పెళ్లి చేసుకోనని బెదిరించాడు. దీంతో మోస పోయానని గ్రహించిన ఆమె.. పోలీసులను ఆశ్రయించింది. ఈ మేరకు రంగంలోకి దిగిన ప్రత్యేక బృందం.. యువతి చెప్పిన వివరాల ఆధారంగా భువనేశ్వర్ వెళ్లి, లక్ష్మీకాంత్‌ను అరెస్ట్ చేశారు. అక్కడి నుంచి మల్కన్‌గిరి తీసుకు వచ్చి, కేసు నమోదు చేయడంతో పాటు శుక్రవారం ఉదయం కోర్టులో హాజరు పరిచారు.

ఝరపడా జైలుకు నిందితుల తరలింపు



- బహనాగా బజార్ రైలు దుర్ఘటనలో కొనసాగుతున్న దర్యాప్తు
- ఈనెల 27కు కేసు విచారణ వాయిదా

భువనేశ్వర్: బాలాసోర్ జిల్లా బహనాగా బజార్ రైల్వేస్టేషన్ వద్ద జరిగిన రైలు ప్రమాదంలో అరెస్టయిన ముగ్గురు నిందితుల రిమాండ్ గడువు శుక్రవారంతో ముగిసింది. ఈ ముగ్గురినీ ఝరపడా జైలుకు తరలించారు. ఈనెల 7న స్థానిక ప్రత్యేక సీబీఐ కోర్టు నిందితులకు 5 రోజుల రిమాండ్ విధించింది. కేసు విచారణ మరింత లోతుగా నిర్వహించాల్సి ఉందనే అభ్యర్థనతో దుర్ఘటనపై దర్యాప్తు చేస్తున్న సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్(సీబీఐ) న్యాయస్థానాన్ని కోరడంతో ఈనెల 11న కోర్టు రిమాండ్‌ను మరో 4 రోజులు పొడిగించేందుకు అనుమతించింది. ఈ వ్యవధి పూర్తి కావడంతో ముగ్గురు నిందితులు(సీనియర్ సెక్షన్ ఇంజనీర్(సిగ్నల్) అరుణ్‌కుమార్ మహంత, సీనియర్ సెక్షన్ ఇంజనీర్ మహ్మద్ అమీర్‌ఖాన్, టెక్నీషియన్ పప్పుకుమార్)ను స్థానిక జైలుకు తరలించారు. కేసు తదుపరి విచారణను ఈనెల 27కి కోర్టు వాయిదా వేసినట్లు ప్రకటించింది. జైలుకు తరలించిన వారిని ఈనెల 7న సీబీఐ దర్యాప్తు బృందం అరెస్ట్ చేసింది. వీరికి వ్యతిరేకంగా ఐపీసీ సెక్షన్లు 304(మరణానికి కారకులు), 201(సాక్ష్యాధారాల గల్లంతు) ఆరోపణల కింద కేసు నమోదు చేశారు.

నార్త్ సిగ్నల్ గూమ్టీ(స్టేషన్) వద్ద సిగ్నలింగ్ సర్క్యూట్ మార్పులో లోపం కారణంగా ప్రమాదం జరిగింది. ఇది మానవ తప్పిదమని ఆగ్నేయ సర్కిల్ రైల్వే భద్రతా కమిషనర్(సీఆర్‌ఎస్) విచారణ నివేదికలో వెల్లడించింది.

నలుగురు ఉద్యోగులపై..

బహనాగా బజార్ రైలు దుర్ఘటన ఘటనలో మరో నలుగురు ఉద్యోగులను సీబీఐ దర్యాప్తు బృందం ప్రశ్నిస్తోంది. స్థానిక ఝరపడా జైలు ప్రాంగణంలో ఈ విచారణ కొనసాగుతోంది. వీరిలో ఇద్దరు సిగ్నల్ ఆపరేటర్లు, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్, స్టేషన్ మాస్టర్ ఉన్నారు. వీరందరినీ రైల్వేశాఖ విధుల నుంచి తొలగించినట్లు ఉత్తర్వులు జారీ చేసింది.

నవరంగపూర్ అభివృద్ధికి రూ.15,038 కోట్లు



ప్రణాళికా సమావేశంలో చైర్మన్ మనోహర్ రంధారీ, కలెక్టర్ మిశ్రా, ఎంపీ రమేష్, ఎమ్మెల్యే ప్రకాష్

- జిల్లా ప్రణాళికా సమావేశంలో ఆమోదం తెలిపిన సభ్యులు

నబరంగ్‌పూర్: నవరంగ్‌పూర్ జిల్లా అభివృద్ధికి రూ.15,038 కోట్లు వెచ్చించేందుకు ప్రణాళికా ఆమోదం లభించింది. జిల్లా కేంద్రంలోని మిషన్‌శక్తి సమావేశ మందిరంలో జిల్లాస్థాయి ప్రణాళికా సంఘం సమావేశం శుక్రవారం నిర్వహించారు. ప్రణాళికా సంఘం అధ్యక్షుడు, నవరంగ్‌పూర్ ఎమ్మెల్యే మనోహర్ రంధారీ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో 2023-24 సంవత్సరానికి సంబంధించి ప్రతిపాదనలు ప్రవేశపెట్టారు. వ్యవసాయం, గ్రామీణాభివృద్ధి, వరద సహాయక చర్యలు, విద్య, పశు సంవర్ధక, తాగునీరు తదితర అంశాలకు అధిక ప్రాధాన్యమిస్తూ పలు ప్రతిపాదనలు చేశారు. సభ్యులు ఎటువంటి అభ్యంతరాలు లేకుండా ముగించారు. సమావేశంలో నవరంగ్‌పూర్ పార్లమెంట్ సభ్యుడు రమేష్‌చంద్ర మాఝి, నవరంగ్‌పూర్ ఎమ్మెల్యే సదాశివ ప్రధాన్, జొరిగాం ఎమ్మెల్యే ప్రకాష్‌చంద్ర మాఝి, ఉమ్మర్‌కోట్ ఎమ్మెల్యే నిత్యానంద గొండో, కలెక్టర్ డాక్టర్ కమలోచన్ మిశ్రా, డీఆర్‌డీఏ పీడీ అన్య దాస్ తదితరులు పాల్గొన్నారు.

అనుమానాస్పదంగా వ్యక్తి మృతి

బొండపల్లి: మండలంలోని గొట్లాం గ్రామ సమీపంలో రైల్వే ట్రాక్ మధ్యలో గుర్తు తెలియని వ్యక్తి అనుమానాస్పదంగా మృతి చెంది ఉండడాన్ని స్థానికులు శుక్రవారం సాయంత్రం గుర్తించారు. రైల్వే పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలాన్ని విజయనగరం రైల్వే సీఐ వెంకటరావు, ఎస్‌ఐ రవివర్మ, గజపతినగరం సీఐ ఎల్.అప్పలనాయుడు, బొండపల్లి ఎస్‌ఐ రవి సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతుని వయసు 45 నుంచి 50 సంవత్సరాల మధ్య ఉంటుందని, మృతుని ముఖ భాగం పూర్తిగా గుర్తు పట్టలేని విధంగా ఉండడంతో పాటు ఒక చేయి తెగిపడి ట్రాక్ వెలుపల పడి ఉన్నట్టు గుర్తించినట్టు రైల్వే పోలీసులు తెలిపారు. మృతుని శరీరంపై ఇంకెక్కడ గాయాలు లేకపోవడంతో అనుమానస్పద మృతితో పాటు గుర్తు తెలియని వ్యక్తిగా కేసు నమోదు చేసినట్టు పోలీసులు తెలిపారు. మృతుని వద్ద ఎటువంటి ఆధారాలు కూడా లభ్యం కాలేదని తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం విజయనగరంలోని కేంద్ర సర్వజన ఆస్పత్రికి తరలిస్తున్నట్టు పేర్కొన్నారు. మృతుని ఆచూకీ తెలిసిన వారు విజయనగరం, బొబ్బిలి రైల్వే పోలీసులను సంప్రదించాలని కోరారు. రైల్వే పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నేల బావిలో దిగి వ్యక్తి మృతి

రాజాం సిటీ: మున్సిపాల్టీ పరిధి వస్త్రపురి కాలనీకి చెందిన శనపతి శంకరరావు (43) మృతదేహం గోపాలపురం వెళ్లేదారిలోని నేలబావిలో శుక్రవారం లభ్యమైంది. దీనికి సంబంధించి ఎస్‌ఐ వై.రవికిరణ్ తెలిపిన వివరాలు.. వస్త్రపురి కాలనీలో నివాసం ఉంటున్న శంకరరావు స్థానిక వాసవీ జ్యూట్ మిల్లులో కూలీగా విధులు నిర్వహిస్తున్నాడు. ఈ నెల 12న ఫ్యాక్టరీకి అని ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. అప్పటి నుంచి ఇంటికి రాకపోవడంతో డోలపేటలోని తన సోదరుల ఇంటికి వెళ్లి ఉంటాడని అనుకుని అక్కడకు ఫోన్ చేసిన భార్య రహీస్‌కు ఇక్కడకు రాలేదని చెప్పారు. ఇంతలో గోపాలపురం వైపు వెళ్తున్న వారు బావిలో తేలియాడుతున్న మృతదేహాన్ని చూసి స్థానికులకు సమాచారం అందించారు. బావి వద్దకు చేరుకుని పరిశీలించి శంకరరావు మృతదేహంగా గుర్తించారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. బావి ఒడ్డున దుస్తులు ఉండడాన్ని బట్టి శంకరరావు స్నానానికి బావిలోకి దిగి ప్రమాదవశాత్తు మృతి చెంది ఉంటాడని భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.

ప్రేమ పేరిట మోసం చేసిన వ్యక్తిపై కేసు

కురుపాం: మండలంలోని గుమ్మ గ్రామానికి చెందిన కొనిస అభిషేక్ ప్రేమ పేరుతో ఓ గిరిజన వ్యాయామ ఉపాధ్యాయురాలిని మోసగించిన సంఘటనపై కేసు నమోదు చేసినట్టు ఎల్విన్‌పేట సీఐ సత్యనారాయణ, కురుపాం ఎస్‌ఐ సీహెచ్ ప్రసాద్ శుక్రవారం తెలిపారు. ఓ వ్యాయామ ఉపాధ్యాయురాలిని పెళ్లి చేసుకుంటానని నమ్మించిన అభిషేక్ తరువాత ముఖం చాటేశాడని పేర్కొన్నారు. బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పాలకొండ డీఎస్పీ కృష్ణారావు, ఎల్విన్‌పేట సీఐ సత్యనారాయణ పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు.

నోరూరించే మన్యం రుచులు

పచ్చని కొండలు.. విశాలమైన ఆటవీ ప్రాంతం పార్వతీపురం మన్యం జిల్లా సొంతం. ఇక్కడి కొండపోడులో సేంద్రియ పద్ధతుల్లో గిరిజన రైతులు సాగుచేసే చిరుధాన్యాలు ఆరోగ్యకరం. అందుకే బహిరంగ మార్కెట్‌లో గిరాకీ ఉంది. అవే చిరుధాన్యాలతో గిరిజన మహిళలు ప్రత్యేక యూనిట్లు ఏర్పాటుచేసి ఆరోగ్యకర ఆహారపదార్థాలను తయారు చేస్తున్నారు. దేశ వ్యాప్తంగా ప్రధాన కూడళ్లలో స్టాల్స్‌ను ఏర్పాటుచేసి ఆరోగ్యకర ఉత్పత్తులను ప్రజలకు చౌకగానే అందిస్తున్నారు. ఐటీడీఏ సహకారంతో యూనిట్లను విస్తరింపజేసేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నారు. మన్యంలో తయారు చేస్తున్న 'చిరు' ఉత్పత్తులు, విక్రయాలు, వాటివల్ల కలిగే ఆరోగ్యకర ప్రయోజనాలపై 'సాక్షి' అక్షర రూపం.

- ఏజెన్సీలో సేంద్రియ పద్ధతుల్లో సాగుచేసిన చిరుధాన్యాలతో ఆరోగ్యకర ఆహారపదార్థాల తయారీ
- విరివిగా విక్రయాలు
- రైల్వే, బస్‌స్టేషన్లు, ప్రధాన కూడళ్లలో స్టాల్స్
- ఆరోగ్యకర ఉత్పత్తులకు పెరుగుతున్న డిమాండ్
- ఆమోదం బ్రాండ్‌తో ఆన్‌లైన్‌లో అమ్మకాలు
- చౌకగా ఆరోగ్యకర ఉత్పత్తులు లభ్యం
- గిరిజన మహిళలే ఉత్పత్తిదారులు
- తోడ్పాటునందిస్తున్న ఐటీడీఏ





జిల్లా కేంద్రంలో ఏర్పాటుచేసిన చిరుధాన్యాలతో సిద్ధం చేసిన తినుబండారాల స్టాల్స్

విజయనగరం డెస్క్:

ప్రస్తుత సాంకేతిక యుగంలో ప్రతి ఒక్కరిదీ ఉరుకులపరుగుల జీవనం. సరైన ఆహారం తీసుకోకపోవడం, వ్యాయామానికి దూరం కావడంతో అనారోగ్యానికి గురవుతున్నారు. రసాయన ఎరువులతో పండించిన పంటలు కూడా ప్రజల ఆరోగ్యంపై తీవ్రప్రభావం చూపుతున్నాయన్నది వైద్యుల మాట. అందుకే సేంద్రియ పద్ధతుల్లో పండించే చిరుధాన్యాలతో తయారు చేసిన ఆహారపదార్థాలను తీసుకోవాలని పదేపదే చెబుతున్నారు. దేశ ప్రజల అవసరాలకు అనుగుణంగా చిరుధాన్యాల సాగును సైతం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రోత్సహిస్తున్నాయి. మద్దతు ధర కల్పనతో పాటు విత్తనాలను ఉచితంగా, రాయితీపై సరఫరా చేస్తున్నాయి. ఐక్యరాజ్య సమితి సైతం 2023 సంవత్సరాన్ని మిల్లెట్స్ ఇయర్‌గా ప్రకటించడంతో దీనిపై మరింత ప్రత్యేక దృష్టిసారించాయి.



ప్రభుత్వాల సహకారాన్ని పార్వతీపురం మన్యం జిల్లాలోని గిరిజన సంఘాల మహిళలు (వన్‌ధన్ వికాస కేంద్రాలు) అందిపుచ్చుకుంటున్నారు. స్థానికంగా లభ్యమయ్యే చిరుధాన్యాలతో (రాగులు, కొర్రలు, జొన్నలు, మిక్సిడ్ గ్రైన్స్, ఊదలు, సామలు, గంటిలు తదితరవి) వినియోగదారులు నోరూరించే ఆహారపదార్థాలను తయారు చేస్తున్నారు. ప్రత్యేకంగా స్టాల్స్ ఏర్పాటుచేసి విక్రయిస్తున్నారు. వీరికి కలెక్టర్‌తో పాటు ఐటీడీఏ అధికారులు పూర్తిస్థాయిలో సహకారం అందిస్తుండడంతో వ్యాపారాన్ని మరింత ముందుకు సాగించే ప్రణాళికలు రూపొందిస్తున్నారు.



కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన మిల్లెట్ స్టాల్

ఐటీడీఏ ప్రోత్సాహంతో..



ఐటీడీఏ ప్రోత్సాహంతో మిల్లెట్స్‌తో తినుబండారాల తయారీపై హైదరాబాద్‌లో శిక్షణ పొందాను. నేను నేర్చుకున్న విధానంపై స్థానికంగా పలువురు గిరిజన మహిళలు అవగాహన కల్పిస్తున్నాను. 2022లో నలుగురు మహిళలం చిరుధాన్యాలతో తినుబండారాల తయారీ యూనిట్ ప్రారంభించాం. నెలకు రూ.50వేల నుంచి రూ.70 వేల విలువైన సరుకులు సిద్ధం చేసి అమ్మకాలు చేపడుతున్నాం. రూ.15 వేల నుంచి రూ.20వేల వరకు ఆదాయం వస్తోంది. కొర్రలు, మల్టీగ్రెయిన్ మిల్లెట్స్‌తో తయారు చేస్తున్న లడ్డూలు, బిస్కెట్లు, జంతికలకు మార్కెట్‌లో అధిక డిమాండ్ ఉంది. ఇవి పూర్తి ఆరోగ్యకరం.

– కండంగి సాయికుమారి

వినియోగం పెరిగింది



ఆరోగ్య పరిరక్షణలో భాగంగా చిరుధాన్యాలతో తయారుచేస్తున్న తినుబండాలరాల వినియోగం ఇప్పుడిప్పుడే పెరిగింది. బహిరంగ మార్కెట్‌లో మంచి గిరాకీ లభిస్తుంది. మార్కెటింగ్ పెంచేందుకు అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నాం. రాగి జావ పిండి, మల్టీ గ్రెయిన్ పిండితోపాటు, లడ్డూలు, బిస్కెట్లు, జంతికలు ఉత్తరాంధ్ర జిల్లాలతో పాటు, ఇతర ప్రాంతాలకు మార్కెటింగ్ చేస్తున్నాం. వినియోగదారుల, దుకాణదారుల ఆర్డర్ మేరకు సరుకులు తయారు చేస్తున్నాం. రానున్న రోజుల్లో వినియోగదారుల అవసరం మేరకు యూనిట్లను విస్తరింపజేస్తాం.

వై.పార్వతి, మార్కెటింగ్ నిర్వాహకురాలు

చిరు ధాన్యాలతో తయారు చేసిన ఉత్పత్తులకు సంప్రదించాల్సిన యూనిట్ నిర్వాహకుల నంబర్లు

కుండింగి సాయికుమారి	:	93989 35807
యొజ్జు పార్వతి	:	77029 91472
ఆన్‌లైన్‌లో	:	ఆమోదం బ్రాండ్

తయారీ ఎక్కడ?

- సీతంపేట ఐటీడీఏ పరిధిలో ముక్కుడు పోలమ్మ (వీడీవీకే) కార్యాలయంలో మిల్లెట్స్ ఉత్పత్తుల తయారు కేంద్రం ఉంది.
- మిల్లెట్స్‌తో ఆహార పదార్థాల తయారీలో ఇక్కడి మహిళలు సీతంపేట ఐటీడీఏ సహకారంతో ఐఐటీ కాన్పూర్ ఆధ్వర్యంలో శిక్షణ పొందారు. రుచికరమైన వంటకాల తయారీలో ట్రైనర్ శ్రీనివాసరావు శిక్షణ ఇచ్చారు.

తయారు చేస్తున్న తినుబండారాలు

ఆహార పదార్థాల తయారీకి ప్రధాన ముడిసరుకులు: గిరిజన రైతులు పూర్తిగా సేంద్రయ పద్ధతుల్లో పండించే కొర్రలు, రాగులు, జొన్నలు, మిక్సిడ్ గ్రైన్స్, ఊదలు, సామలు, గంటిలు తదితర చిరుధాన్యాలు

- కొర్ర జంతికలు, కొర్ర లడ్డూ, మల్టీగ్రెయిన్ బిస్కెట్స్, మల్టీ గ్రెయిన్ లడ్డూ (ప్రస్తుతం వినియోగదారులు అధికంగా ఇష్టపడేవి)
- ఒక్కో ప్యాకెట్‌లో 12 బిస్కెట్స్ చొప్పున బాక్స్‌లో 24 ఉంటాయి. చిరుధాన్యం రకాన్ని బట్టి రూ.30 నుంచి రూ.120కు విక్రయిస్తున్నారు.

ఆదాయం



- ఒక్కో వన్‌ధన్ వికాస కేంద్రం ద్వారా ప్రస్తుతం నెలకు రూ.50 వేల విలువైన ఉత్పత్తులను విక్రయిస్తున్నారు. దీనివల్ల రూ.15 వేల వరకు ఆదాయం ఆర్జిస్తున్నారు.
- వీరు తయారు చేస్తున్న సరుకులు శ్రీకాకుళం, విజయనగరం, విశాఖ, పార్వతీపురం మన్యం జిల్లాతో పాటు ఢిల్లీ, హైదరాబాద్ తదితర ప్రాంతాలకు సరఫరా చేస్తున్నారు. స్థానిక దుకాణాలకు సైతం విక్రయిస్తున్నారు.
- మార్కెటింగ్, వీడీకేల అభివృద్ధికి ఐటీడీఏ సహకారం అందిస్తోంది.

చిరుధాన్యాల పరిశ్రమలను ప్రోత్సహిస్తున్నాం



చిరుధాన్యాల ప్రాసెసింగ్, ఆహార పదార్థాల తయారీ పరిశ్రమలను ప్రోత్సహించే చర్యలు చేపట్టాం. ప్రజలకు ఆరోగ్యకర ఆహారం అందించడంలో భాగంగా సీతంపేట వన్‌ధన్‌వికాస్ కేంద్రం ద్వారా చిరుధాన్యాల ఉత్పత్తుల తయారీని ప్రోత్సహిస్తున్నాం. అక్కడ తయారైన మిల్లెట్ బిస్కెట్లను స్టాల్స్ ఏర్పాటుచేసి విక్రయించేందుకు సహకరిస్తున్నాం. కలెక్టర్ కార్యాలయంలో విజయవంతంగా స్టాల్‌ను నిర్వహిస్తున్నాం. ఉత్పత్తులను మార్కెటింగ్ చేసేందుకు వీడీవీకేలలో గిరిజన మహిళలకు శిక్షణ ఇస్తున్నాం. భవిష్యత్తులో ఇక్కడి నుంచి చిరుధాన్యాలతో తయారుచేసిన ఆహారపదార్థాలు దేశవ్యాప్తంగా సరఫరా చేసేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నాం.

– నిషాంత్‌కుమార్, కలెక్టర్, పార్వతీపురం మన్యం

ఆరోగ్యకర ఆహారం



చిరుధాన్యాలతో తయారు చేసే ఉత్పత్తులు ఆరోగ్యానికి మేలు చేకూరుస్తాయి. చిరుధాన్యాల్లో పిండి పదార్థంతో పాటు ప్రొటీన్లు, పీచు పదార్థం, ఇనుము, కాల్షియం, సూక్ష్మ పోషకాలు అధికంగా ఉంటాయి. పొట్టు తీసిన కొవ్వు కాస్త ఉంటుంది. ఇది కూడా ఆరోగ్యానికి మంచిదే. వీటివల్ల మానవ శరీరంలో జీర్ణ ప్రక్రియ మెరుగుపడుతుంది. శరీరంలో ఆమ్లస్థాయి తగ్గించేందుకు దోహదపడతాయి. కడుపులో ఇబ్బంది, అల్సర్ వంటివి తలెత్తవు. పిల్లల, వృద్ధులకు ఆరోగ్యకర ఆహారం ఇది.

– డా.బి.వాగ్దేవి, జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్, పార్వతీపురం



క్లుప్తంగా

ఖైదీలకు ఉచిత న్యాయ సాయం



ఖైదీలతో మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి సన్యాసినాయుడు

గార: ఖైదీలు తమ కేసులకు సంబంధించి న్యాయవాదిని కోరుకుంటే ఉచితంగా లాయర్‌ను నియమిస్తామని న్యాయసేవాధికార సంస్థ జిల్లా కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఆర్.సన్యాసినాయుడు అన్నారు. శుక్రవారం అంపోలు జిల్లా జైలును సందర్శించారు. ఖైదీల వసతులు, గ్రంథాలయం, భోజన సదుపాయాలపై ఆరా తీశారు. ఖైదీలతో వ్యక్తిగతంగా మాట్లాడి రికార్డులను తనిఖీ చేశారు. కార్యక్రమంలో జైలు సూపరింటెండెంట్ నబీఖాన్, జైలర్ దివాకర్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

దళితుల పక్షపాతి సీఎం జగన్



డీసీఎంఎస్ చైర్‌పర్సన్ సల్ల సుగుణ

ఇచ్ఛాపురం రూరల్: భూమి లేని దళితులకు స్థలం పంపిణీ చేసేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకున్న నిర్ణయం చరిత్రాత్మకమైనదని, దళితుల పక్షపాతిగా మరోమారు రుజువు చేసుకున్నారని డీసీఎంఎస్ చైర్‌పర్సన్ సల్ల సుగుణ అన్నారు. శుక్రవారం ఆమె మాట్లాడుతూ అసైన్డ్ భూములపై యాజమాన్య హక్కు కల్పిస్తూ కేబినెట్‌లో తీసుకున్న నిర్ణయంతో దళితుల్లో ఆత్మస్థైర్యం పెరుగుతుందన్నారు.గతంలో చంద్రబాబు మాయమాటలు చెప్పి మోసం చేశారని, రాబోయే ఎన్నికల్లో టీడీపీని నమ్మే పరిస్థితుల్లో దళితులు లేరని స్పష్టం చేశారు. వలంటీర్ల వ్యవస్థపై పవన్ కల్యాణ్ వ్యాఖ్యలు అమానుషమన్నారు.

25 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం పట్టివేత



కొత్తూరు నివగాంలో పట్టుకున్న పీడీఎస్ బియ్యంతో విజిలెన్స్ అధికారులు, రెవెన్యూ సిబ్బంది

కొత్తూరు : నివగాం గ్రామంలోని రాజరాజేశ్వరి రైస్ మిల్లుకు ఆనుకొని ఉన్న గోదాంలో విజిలెన్స్ సీఐ సింహాచలం, రెవెన్యూ సిబ్బంది శుక్రవారం తనిఖీలు నిర్వహించారు. తనిఖీల్లో గోదాంలో టంకాల శ్రీనివాసరావు అక్రమంగా నిల్వ ఉంచిన 25 కిలోల పీడీఎస్ బియ్యంను అధికారులు పట్టుకున్నారు. బియ్యాన్ని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు విజిలెన్స్ అధికారులు తెలిపారు. దాడుల్లో ఆర్ఐ గిరీష్ కుమార్ పట్నాయిక్ వీఆర్వోలు పాల్గొన్నారు.

ఈకేవైసీ తప్పనిసరి

శ్రీకాకుళం పాతబస్టాండ్: సీఎఫ్ఎంఎస్ ద్వారా జీతాలు పొందుతున్న ప్రభుత్వ ఉద్యోగులు, పింఛనుదారులు ఈకేవైసీ చేయించుకోవాలని ఖజానా శాఖ ఉపసంచాలకులు సీహెచ్.రవికుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సీఎఫ్ఎంఎస్ లాగిన్ డీటెయిల్స్, ఇతర విలువైన సమాచారాన్ని భద్రపర్చుకునేందుకు టూ ఫ్యాక్టర్ అథెంటికేషన్ ఎంతగానో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు.

వాహనం అడ్డగించి చోరీ

టెక్కలి రూరల్: టెక్కలి పాలకేంద్రం వద్ద గురువారం రాత్రి కొంత మంది యువకులు తన ద్విచక్ర హనాన్ని ఆపి నగదు పట్టుకుపోయినట్లు బాధితుడు శుక్రవారం టెక్కలి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. టెక్కలికి చెందిన కోరాడ సతీష్ గురువారం రాత్రి తన ద్విచక్రవాహనంపై టెక్కలి నుంచి చలమయ్యపేట వైపు వెళ్తుండగా పాలకేంద్రం సమీపంలో ముగ్గురు గుర్తు తెలియని వ్యక్తులు బండిని ఆపారు. దాడి చేసి బ్యాగ్ తీసుకుని వెళ్లిపోయారు. అందులో కొంత నగదు ఉన్నట్లు బాధితుడు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు టెక్కలి ఎస్ఐ రామకృష్ణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తు తెలియని జంతువు దాడిలో దూడ బలి

మందస: జాతీయ రహదారి పక్కనే ఉన్న అంబుగాంలో రెండు మూగజీవాలను బలిగొన్న గుర్తు తెలియని జంతువు ఉద్దానంలోని లొహరిబంద ప్రాంతానికి చేరుకుంది. గ్రామ సమీపంలోని తోటల్లో జోగ జానకిరావు అనే రైతుకు చెందిన ఆవుదూడపై గురువారం రాత్రి దాడి చేసి తినేసింది. ఈ మేరకు అటవీశాఖ సిబ్బందికి బాధితుడు ఫిర్యాదు చేశాడు. అటవీ శాఖాధికారులు స్పందించి రక్షణ కల్పించాలని కోరుతున్నారు.

వరల్డ్ తైక్వాండో పోటీలకు ముగ్గురు ఎంపిక

ఇచ్ఛాపురం: ఈ నెల 15, 16 తేదీల్లో హైదరాబాద్‌లోని జీహెచ్ఎంసీ ఇండోర్ స్టేడియంలో జరగనున్న వరల్డ్ తైక్వాండో పోటీలకు స్కూల్ ఆఫ్ తైక్వాండో ఇచ్ఛాపురానికి చెందిన ముగ్గురు విద్యార్థులు ఎంపికైనట్లు కోచ్ దుర్గాప్రసాద్ తెలిపారు. ఈ మేరకు స్కూల్ ఆఫ్ తైక్వాండో ఆవరణలో శుక్రవారం చిన్నారులు పటాన దమయంతి, చాట్ల గిరి, ఆశి కైలాష్‌లను అభినందించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నేత పిలక విజయ్ భాస్కర్‌రెడ్డి, స్థానికులు బి.కృష్ణయ్య, కె.దిలీప్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్దానంలో ఎలుగు హల్‌చల్



ఎలుగు దాడి చేయడానికి ప్రయత్నించడంతో వాహనం వదిలేసిన ప్రయాణికులు



పరిస్థితిని సమీక్షిస్తున్న డీఎఫ్ఓ నిషాకుమారి

మందస: మందస మండలంలోని ఉద్దానం ప్రాంతమైన లోహరిబంద పంచాయతీ యశోదనగర్ జీడి తోటల సమీపంలో శుక్రవారం ఓ ఎలుగుబంటి హల్‌చల్ చేసింది. ఉదయాన్ని ద్విచక్రవాహనదారులను అడ్డగించింది. వారు భయంతో వాహనాలు వదిలి పారిపోయారు. ఈలోగా ఎలుగుబంటి ఉన్న చోటే చుట్టూ తిరగడం ప్రారంభించింది. అదేపనిగా తిరుగుతుండడంతో స్థానికులు అటవీ శాఖాధికారులకు సమాచారం అందించారు. ముందుగా బారువ, మందస అటవీశాఖ అధికారులు అక్కడకు వచ్చి ఎలుగుకు గాయమైనట్లు గుర్తించారు. ఈలోగా డీఎఫ్ఓ నిషాకుమారి, రేంజ్ అధికారి మురళీకృష్ణంనాయుడు, ఎఫ్ఆర్వో నిహారిక(శ్రీకాకుళం), ఎఫ్ఆర్వో రాజశేఖర్(శ్రీకాకుళం), డీఆర్వో రాము(మందస), ఎఫ్‌బీఓ సంతోష్‌కుమార్(బారువా), కాశీబుగ్గ సీఐ శంకరరావు, మందస ఎస్ఐ వై.రవికుమార్ ఆధ్వర్యంలో పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. అయితే ఎలుగును పట్టుకోవడానికి అధికారులు సాహసం చేయలేకపోయారు. దీంతో విశాఖపట్నంలోని జూ అధికారులకు డీఎఫ్ఓ నిషాకుమారి సమాచారం అందించి, జూ వెటర్నరీ అధికారి డాక్టర్ ఫణీంద్రరావు ఆధ్వర్యంలో నిపుణులను రప్పించారు. మందస వెటర్నరీ అధికారి డాక్టర్ దువ్వాడ శ్రీకాంత్ కూడా అప్పటికే అక్కడకు చేరుకున్నారు. ఎలుగు కొంతసేపు సొమ్మసిల్లి పడిపోయినప్పటికీ, అనంతరం తేరుకుని, మళ్లీ తిరగడం ప్రారంభించింది. ఎలుగు గాయపడిందా.. లేక పిచ్చి పట్టిందా.. అనే విషయాన్ని అధికారులు నిర్ధారించలేకపోయారు. రాత్రి కావడంతో ఆపరేషన్‌ను నిలిపి వేస్తున్నట్టు అధికారులు చెప్పారు. శనివారం ఉదయాన్నే ఎలుగును పట్టుకుని, విశాఖ జూకు తరలించడానికి ప్రయత్నాలు చేస్తామని తెలిపారు.

వెంటాడిన మృత్యువు

- లారీ ఢీకొని ఆఫీస్ సబార్డినేట్ మృతి
- గతంలో ఇదే ప్రాంతంలో భార్య మృత్యువాత



ఘటన స్థలంలో మృతదేహం (ఇన్‌సెట్లో) గుల్లిపల్లి జగ్గునాయుడు (ఫైల్)

ఎచ్చెర్ల క్యాంపస్: కేశవరావుపేట పంచాయతీ కింతలిమిల్లు సమీపంలో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో గుల్లిపిల్లి జగ్గునాయుడు (52) దుర్మరణం చెందారు. ఈయన శ్రీకాకుళం పట్టణంలోని దివ్యాంగ శాఖ కార్యాలయంలో ఆఫీస్ సబార్డినేట్‌గా పనిచేస్తున్నారు. శ్రీకాకుళం పట్టణం వైపు ద్విచక్ర వాహనంపై వెళుతుండగా కింతమిల్లు సర్వీస్ రోడ్డుపై వెనుక నుంచి లారీ ఢీ కొట్టింది. ఈ ఘటనలో జగ్గునాయుడు అక్కడికక్కడే మృతి చెందారు. విజయనగరం ప్రాంతానికి చెందిన ఈయన 20 ఏళ్ల క్రితం ఎచ్చెర్లలో స్థిరపడ్డారు. ఎచ్చెర్ల అంబేడ్కర్ గురుకులం పక్కన ఉన్న దివ్యాంగ శిక్షణ ఉత్పత్తి కేంద్రంలో పనిచేశారు. కొన్నేళ్ల క్రితం కేంద్రం మూతపడగా ప్రస్తుతం శ్రీకాకుళం పట్టణంలో విధులు నిర్వర్తిస్తున్నారు. ఈయన భార్య జ్యోతి సైతం కింతలిమిల్లు సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలోనే మృతి చెందడం గమనార్హం. మూడేళ్ల కిందట జ్యోతి పొన్నాడ కేజీబీవీలో నాన్ టీచింగ్ సిబ్బందిగా పనిచేస్తూ విధులు పూర్తయ్యాక ఎచ్చెర్లకు ఇంటికి వస్తుండగా కింతలిమిల్లు సమీపంలో ఆటో బోల్తాపడింది. అందులో ప్రయాణిస్తున్న జ్యోతి తీవ్రగాయాలై మృతి చెందింది. వీరికి ఇద్దరు కుమార్తెలు. పెద్దకుమార్తె సాయిలక్ష్మి డిగ్రీ చదువుతుండగా, చిన్న కుమార్తె లోకిత ఇంటర్మీడియట్ చదువుతోంది. తల్లిదండ్రులిద్దరూ రోడ్డు ప్రమాదంలో మృతిచెందడంతో పిల్లలు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. ఎచ్చెర్ల పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని ట్రాఫిక్ క్రమబద్ధీకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రుణాలు సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న ప్రాజెక్టు మేనేజర్ నారాయణరావు

ఎచ్చెర్ల క్యాంపస్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్వయం సహాయ సంఘాలకు, గ్రామీణ యువతకు అందజేస్తున్న రాయతీ రుణాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా వెలుగు జీవనోపాధుల జిల్లా ప్రాజెక్టు మేనేజర్ నారాయణరావు అన్నారు. ఎచ్చెర్లలోని జిల్లా సాంకేతిక శిక్షణ కేంద్రంలో రాయితీ రుణాల మంజూరు, అర్హత అంశాలపై బ్యాంకర్లు, వెలుగు సిబ్బందికి శుక్రవారం శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీఎంఈజీపీ, పీఎంఎఫ్ఎంఈ పథకాల్లో భాగంగా అందిస్తున్న రుణాలను నిరుద్యోగులు, యువత సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కొన్ని రుణాలపై 35 శాతం రాయితీ లభిస్తుందని చెప్పారు. చిన్న పరిశ్రమలు, చిన్న చిన్న యూనిట్ల ఏర్పాటుకు రుణాలు ఉపయోగపడతాయని తెలిపారు. ప్రధానమంత్రి మైక్రో ఫుడ్ ప్రాసెసింగ్ స్కీం కింద ఆహార ధాన్యాలు, పిండి, నూక తయారీ వంటి యూనిట్లు ఏర్పాటు చేసుకోవచ్చన్నారు. ఆసక్తి గల వారు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ప్రధానమంత్రి ఎంప్లాయ్ జనరేషన్ స్కీం సైతం యువతకు మంచి అవకాశమని చెప్పారు. కార్యక్రమంలో ఎచ్చెర్ల క్లస్టర్ ఏరియా కోఆర్డినేటర్ రవి, బ్యాంకు లింకేజ్ మేనేజర్ నాగలక్ష్మి, ఏపీఎంలు రామ్మూర్తి, రత్నం, రామకృష్ణనాయుడు, శ్యామ్, కూర్మారావు, మాధవీలత పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి ఉషూ పోటీలకు సిద్ధం

- నేడు వప్పంగి వేదికగా స్టేట్‌మీట్
- హాజరుకానున్న 230 మంది క్రీడాకారులు



ఉషూ సాధనలో క్రీడాకారులు

శ్రీకాకుళం న్యూకాలనీ: రాష్ట్రస్థాయి ఉషూ పోటీలకు సర్వం సిద్ధమైంది. ఈనెల 15, 16 తేదీల్లో రెండు రోజులపాటు గార మండలం వప్పంగి గ్రామంలోని ఈటీఎస్ కల్యాణ మండపం వేదికగా ఏపీ రాష్ట్రస్థాయి ఉషూ చాంపియన్‌షిప్-2023 పోటీలు జరగనున్నాయి. ఇందుకోసం జిల్లా ఉషూ అసోసియేషన్ ప్రతిష్టాత్మకంగా ఏర్పాట్లు చేసింది. శనివారం ఉదయం 10 గంటలకు జరిగే ఈ పోటీల ప్రారంభోత్సవానికి మంత్రి ధర్మాన ప్రసాదరావు, ఇతర ప్రజాప్రతినిధులు, జిల్లా ఉన్నతాధికారులు హాజరుకానున్నారు. ఉమ్మడి 13 జిల్లాల నుంచి 230 మంది వరకు క్రీడాకారులు హాజరవుతారని అంచనా వేస్తున్నారు. తౌలు, సాంద కేటగిరిల్లో నాకౌట్ పద్ధతిలో పోటీలు జరుగుతాయి. జిల్లా నుంచి స్టేట్‌మీట్‌కు ఎంపికైన క్రీడాకారులకు కొద్దిరోజులుగా జిల్లా కార్యదర్శి, చీఫ్ కోచ్ రెడ్డి శివకుమార్ నేతృత్వంలో ఉన్నతంగా తీర్చిదిద్దారు. జిల్లా ఉషూ అసోసియేషన్ అధ్యక్షుడు పొగిరి కృష్ణంనాయుడు, ప్రధాన కార్యదర్శి రెడ్డి శివకుమార్ సారథ్యంలో అసోసియేషన్ ప్రతినిధులు, సీనియర్ క్రీడాకారులతో కూడిన నిర్వహణ కమిటీని నియమించారు. రిఫరీలుగా వెంకటేశ్వరరావు (విశాఖ), బి.సాయి (గుంటూరు), శ్రీనివాసరావు (కర్నూలు), వంశీ (తూర్పుగోదావరి), రెడ్డి శివకుమార్ (శ్రీకాకుళం) హాజరవుతున్నారు. పరిశీలకులుగా రాష్ట్ర ఉషూ సంఘ సంయుక్త కార్యదర్శి బి.నర్సింగరావు (గుంటూరు), ఒలింపిక్ అసోసియేషన్ ప్రతినిధులు హాజరుకానున్నారు.

అసిరితల్లి ఆలయంలో చోరీ



అమ్మవారి ఆలయాన్ని పరిశీలిస్తున్న రెండో పట్టణ పోలీసులు

శ్రీకాకుళం క్రైమ్: నగరంలోని సీపన్నాయుడుపేట సమీపంలో అసిరితల్లి అమ్మవారి దేవాలయంలో చోరీ జరిగినట్లు శ్రీకాకుళం రెండో పట్టణ పోలీస్ స్టేషన్ సీఐ పప్పల శ్రీనివాసరావు తెలిపారు. అమ్మవారి గుడిలో ఎచ్చెర్ల మండలం పూడివలసకు చెందిన కురిటి రాంబాబు ఐదేళ్లుగా పూజారిగా సేవలందిస్తున్నారు. ప్రతిరోజూ ఉదయం ఆరు నుంచి పది గంటల వరకు, సాయంత్రం నాలుగు నుంచి ఆరుగంటల వరకు గుడి తెరిచి ఉంచుతున్నారు. ఎప్పటిలాగే గురువారం రాత్రి ఆరుగంటలకు తాళాలు వేసి ఇంటికి వెళ్లిపోయారు. శుక్రవారం ఉదయం వచ్చి చూసేసరికి గుడిలోపల పడమర గోడకు కన్నంపెట్టి ఉంది. ఉత్తర ద్వారం తలుపు తాళాలు పగలగొట్టి ఉన్నాయి. గర్భగుడికి వెళ్లి చూసేసరికి అమ్మవారి బంగారు బొట్టు, కళ్లు, పుస్తులు, శతమానం (అంతా కలిపి తులం), వెండి కిరీటం, చెవి దిద్దులు, శఠగోపం, వెండి గ్లాసు, చెంచా (మొత్తం రెండు కిలోలు) మాయమయ్యాయి. హుండీలో నగదు కనిపించ లేదు. పూజారి ఇచ్చిన ఫిర్యాదు మేరకు చోరీ జరిగిన ప్రదేశానికి సీఐ శ్రీనివాసరావు, ఎస్ఐలు లక్ష్మణరావు, సందీప్, ఏఎస్ఐ, క్లూస్ టీమ్ వెళ్లి పరిసరాలను పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ చెప్పారు.

ఫిర్యాదు చేసిన ఆరు గంటల్లోనే..

- విజయనగరం వెళ్లి దొంగలను పట్టుకున్న గార పోలీసులు
- నాలుగున్నర తులాల బంగారం రికవరీ



వివరాలు వెల్లడిస్తున్న ఎస్ఐ కామేశ్వరరావు

గార: బంగారం చోరీకి సంబంధించి ఫిర్యాదు అందిన ఆరు గంటల్లోనే గార పోలీసులు కేసు ఛేదించారు. ఇద్దరిని అరెస్టు చేసి బంగారం రికవరీ చేశారు. ఈ ఘటనకు సంబంధించి గార ఎస్ఐ ఎస్.కామేశ్వరరావు శుక్రవారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి వివరాలు వెల్లడించారు. పర్లాకిమిడి సమీపంలోని పుసికిడి గ్రామానికి చెందిన బంకుపల్లి జయలక్ష్మి ఈ నెల 11న శాలిహుండంలోని తన కుమార్తె ఇంటికి బయలుదేరింది. పాతపట్నం నుంచి బస్సులో వచ్చి సాయంత్రం నాలుగున్నర గంటల ప్రాంతంలో భైరి జంక్షన్‌లో దిగింది. శాలిహుండం వెళ్లేందుకు ఆటో ఎక్కింది. అప్పటికే ఆటోలో చంటిబిడ్డతో ఉన్న తల్లి, ప్రయాణికులు ఉన్నారు. మార్గమధ్యలోకి వచ్చేసరికి అత్యవసర పని పడిందని, ఇక్కడ దిగిపోయి మరో ఆటో ఎక్కి శాలిహుండం వెళ్లాలని జయలక్ష్మిని దించేశారు. ఈ క్రమంలో జయలక్ష్మి తీసుకువచ్చిన బ్యాగు కింది భాగాన్ని కోసి అందులో నాలుగున్నర తులాల బంగారాన్ని కాజేశారు. దీనిని జయలక్ష్మి గమనించక తన కుమార్తె ఇంటికి వెళ్లిపోయింది. అక్కడ బ్యాగును చూడగా బంగారం కనిపించలేదు. ఇంటి వద్ద ఉంచేశానా అన్న సందిగ్ధతలో మరుసటి రోజు 12వ తేదీన పుసికిడిలోని తన ఇంటికి వెళ్లి వెతికింది. అక్కడా బంగారం కనిపించకపోవడంతో చోరీకి గురైందని గుర్తించి శుక్రవారం మధ్యాహ్నం 12 గంటల ప్రాంతంలో గార స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేసింది. వెంటనే పోలీసులు అప్రమత్తమై దర్యాప్తు చేపట్టారు. సీసీ టీవీ ఫుటేజీ, ఫోన్ సిగ్నల్స్ ఆధారంగా విజయనగరం జిల్లాకు చెందిన గొర్లె మౌనిక, సహాయకుడు బాలకృష్ణ బంగారం దొంగిలించినట్టు గుర్తించారు. మెంటాడ మండలంలో ఉన్న వీరిద్దరిని పట్టుకుని నాలుగున్నర తులాల బంగారాన్ని రికవరీ చేశారు. అనంతరం కేసును నమోదు చేశారు. వీరిపై జిల్లాలో శ్రీకాకుళం రూరల్, జేఆర్‌పురం, రాజాం, గార వంటి పలుస్టేషన్లలో పది కేసులు ఉన్నాయని ఎస్ఐ తెలిపారు.

రెండు రంగాలకు ఊతం..

ఉపాధి రథం





శ్రీకాకుళం హౌసింగ్ బోర్డు కాలనీకి చెందిన మురళీ.. టిఫిన్లను విక్రయిస్తుంటాడు. మున్సిపాలిటీ పరిధిలో ట్రాఫిక్ మధ్య బండి ఏర్పాటు చేయాలంటే చాలా కష్టం. అందుకే మొబైల్ క్యాంటిన్ సిద్ధం చేయాలనుకున్నాడు. కోల్‌కతా నుంచి చార్జింగ్ ఆటోను తెప్పించారు. ఫ్యాబ్రికేషన్ వర్కర్‌ని కలిసి తాను చేయబోయే వ్యాపారం ఇతర వివరాలను చెప్పాడు. పదిరోజుల వ్యవధిలో మొబైల్ క్యాంటీన్‌ను రెడీ అయింది.

శ్రీకాకుళానికి చెందిన ఓ యువకుడు ఇటీవలే చికెన్ షాపు ప్రారంభించాడు. రోజూ ఫారం నుంచి కోళ్ల నుంచి తీసుకురావడంలో ఇబ్బందుల్ని గమనించాడు. ఫ్యాబ్రికేషన్ వర్కర్‌ని కలిసి తన అవసరాన్ని వివరించాడు. ద్విచక్రవాహనం వెనక వైపు కోళ్లను తరలించేలా ప్రత్యేక ఏర్పాటు చేయించుకున్నాడు.

- అవసరాలకు అనుగుణంగా వ్యాపార వాహనాల తయారీ
- కొత్త తరహా బళ్లతో చిరు వ్యాపారులకు ఉత్సాహం
- వ్యాపారుల ఆలోచనలకు రూపమిస్తున్న ఫ్యాబ్రికేటర్లు

ప్రస్తుత పోటీ ప్రపంచంలో మనదంటూ ఏదో ప్రత్యేకత, కొత్తదనం ఉంటే తప్ప రాణించలేం. వ్యాపారానికి కూడా ఇదే సూత్రం వర్తిస్తుంది. దానికి ఆలోచన, ఆర్థిక స్థోమత అవసరం. చిరు వ్యాపారులు, రెక్కల కష్టంతో జీవన రథాన్ని లాగుతున్నవారికి తమ వ్యాపారాన్ని సులభ సాధ్యం చేసుకోవాలని, అదనపు సొబగులు అద్దాలని ఆశ ఉన్నా.. ఆర్థిక సమస్యలు వెనక్కి లాగుతున్నాయి. దాంతో వారు సృజనకు పదును పెడుతున్నారు. సూక్ష్మంలో మోక్షంలా తక్కువ ఖర్చుతోనే అదనపు హంగులు అద్దే ఆలోచనలు చేస్తున్నారు. వాటిని ఫ్యాబ్రికేటర్ల సాయంతో ఆచరణలో పెడుతున్నారు. తమ ఉపాధి రథాలకు కొత్త రూపునిచ్చి, వ్యాపారాన్ని కొత్త పుంతలు తొక్కిస్తున్నారు. చిరు వ్యాపారులు సృజనశీలత ఫ్యాబ్రికేషన్ రంగం అభివృద్ధికి కూడా ఊతమిస్తోంది.

–శ్రీకాకుళం డెస్క్

జిల్లాలో చాలా మంది తమ రోజు వారీ వ్యాపార వ్యవహారాలకు సంబంధించిన అవసరాల కోసం ఉపాధి రథాలను తయారు చేయించుకుంటున్నారు. ఈ బళ్ల తయారీకి ఉపాధి బాగుండడంతో చాలా మంది వీటి తయారీలో మెలకువలను నేర్చుకుని అద్భుతమైన రీతిలో బళ్లను తయారు చేస్తూ కస్టమర్లకు అందిస్తున్నారు.

వాస్తు ప్రకారం...

వ్యాపారి అవసరం.. బడ్జెట్‌ను బట్టీ బండి తయారీ డిజైన్ రూపొందిస్తామని చెబుతున్నారు తయారీదారులు. ఆహార విక్రయాలకు సంబంధించిన బళ్ల విషయంలో స్టెయిన్‌లెస్ స్టీల్‌తో మాత్రమే రూపొందిస్తామని, అలా అయితేనే రోజువారీ శుభ్రపరుచుకునేందుకు వీలుగా ఉంటుందని.. తుప్పు పట్టదని శ్రీకాకుళంలోని సాయినాథ్ ఫ్యాబ్రికేషన్స్ యజమాని ఈశ్వర్ ప్రసాద్ రావు సాక్షికి తెలిపారు. అలాగే వీరు రూపొందించే వాహనంలో దోసెల పెనం.. వేడి చేసే ప్రత్యేక ఏర్పాట్లు.. వాటర్ ట్యాంక్.. వాష్ బేసిన్ లాంటివి ఉంటాయి. కాబట్టి పక్కా వాస్తు ప్రకారమే బండిని సిద్ధం చేస్తామని చెప్పారాయన.



కూరగాయలను తరలించే బండి



వాహనాన్ని సిద్ధం చేస్తూ..

ఉపాధి కోణం..

శ్రీకాకుళం నగరంలో ఈ తరహా బళ్లను రూపొందించే సంస్కృతి 2016లో మొదలైందని చెబుతున్నారు తయారీ దారులు. ఇటీవల కాలంలో ఉపాధి కోసం బళ్లను వినియోగించే వారి సంఖ్య పెరగడంతో తమకూ మంచి ఉపాధి లభిస్తోందని అంటున్నారు. పాతబండైనా.. కొత్త బండైనా ఫ్యాబ్రికేషన్ వర్క్స్ ఖర్చు ఒకటేనని చెబుతున్నారు. తయారీకి వినియోగించిన స్టీల్ బరువును బట్టి చార్జీలుంటాయని చెప్పారు. కేజీ స్టీల్ వినియోగిస్తే స్టీల్, లేబర్ చార్జీ రూ.650 వరకు తీసుకుంటామని వివరించారు.

పర్యావరణ స్పృహ..

ఫ్యాబ్రికేషన్ పనులకు సంబంధించిన ఇటీవల పర్యావరణ హితమైన బ్యాటరీ చార్జింగ్ వాహనాలకే ప్రాధాన్యమిస్తున్నారని చెబుతున్నారు తయారీదారులు. వీటిని కోల్‌కతా నుంచి నగరానికి తెప్పిస్తున్నామన్నారు. వీటి ఖరీదు రూ.1.25 లక్షల వరకు ఉందని.. ఫ్యాబ్రికేషన్ పనితో కలిపి దాదాపు రూ.3లక్షల వరకు ఒక్కో బండికి ఖర్చవుతుందని వ్యాపారి వెంకటేశ్వరరావు 'సాక్షి'కి చెప్పారు.

- కోళ్లను తరలించేందుకు, తోపుడు బళ్లకు, గ్యాస్ డెలివరీ బాయ్స్ వాహనాలకు సంబంధించి రూ.5 వేల నుంచి రూ.10 వేల వరకు ఖర్చు అవుతుంది.
- అలాగే రాత్రి వేళల్లో వ్యాపారం సాగించే వారి కోసం ఎల్ఈడీలతో కూడిన ప్రత్యేక లైట్లను వినియోగిస్తున్నారు. సోలార్ సదుపాయం ఉన్న వాహనాలు కూడా నగరంలో ఉన్నాయి.

ఐదుబళ్లు తయారు చేయించా..



తొలినాళ్లలో నేను తోపుడుబండితో వ్యాపారం చేసేవాడ్ని. ఇప్పుడు దాని నిర్వహణ కష్టతరంగా మారింది. 2016లో తొలిసారిగా నగరంలోనే బండిని తయారీ చేయించా. ప్రస్తుతం ఇలాంటి బళ్లు నా వద్ద ఐదు ఉన్నాయి. అన్నీ బ్యాటరీ వాహనాలే.

– కిల్లంశెట్టి వెంకటేశ్వరరావు, మొబైల్ క్యాంటిన్ వ్యాపారి.

డిమాండ్ బాగుంది..



వ్యాపారుల అవసరాలను బట్టి డిజైన్ చేస్తున్నాం. వాస్తు ప్రకారం చేస్తున్నాం. డిమాండ్ బాగానే ఉంది. మొబైల్ క్యాంటీన్లు ఎక్కువగా తయారు చేయిస్తున్నారు. దేవాలయాలకు సంబంధించిన రథాలను కూడా తయారు చేస్తున్నాం. పెళ్లి ఊరేగింపులకు వినియోగించే వాహనాలను సిద్ధం చేస్తున్నాం.

–శలపాక ఈశ్వర ప్రసాదరావు, సాయినాథ్ ఐరన్ అండ్ స్టెయిన్‌లెస్ స్టీల్ ఫ్యాబ్రికేటింగ్ వర్క్స్



దేవుని ఊరేగింపు కోసం రథం..

వాహనం తయారీకి పట్టే సమయం: 10 నుంచి 30 రోజులు	కేజీ స్టీల్‌కి ల్యాబర్ చార్జీతో సహా వసూలు చేసే మొత్తం: రూ.600 వరకు	ఏయే వాహనాలు: మొబైల్ క్యాంటీన్లు, డీజే వాహనాలు, టిఫిన్ బళ్లు, టీబళ్లు, రిక్షా ట్రాలీలు, గ్యాస్ డెలివరీ చేసే ద్విచక్రవాహనాలు	ఫ్యాబ్రికేషన్స్ పనుల మీద ఆధారపడి జీవిస్తున్నవారు: 50 మంది వరకు